ప్రజాశక్తి

బుధవారం 28 జూన్ 2023

5

శ్రీ సత్యసాయి





సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రకుమార్ నేగి

జల సంరక్షణ ఉద్యమంలో

అందరి భాగస్వామ్యం

జల్ శక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ రాజేంద్ర కుమార్ నేగి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జల సంరక్షణ జాతీయ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జల్ శక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ రాజేంద్ర కుమార్ నేగి పేర్కొన్నారు. మంగళవారం నాడు పుట్టపర్తి కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో నుంచి జల్ శక్తి అభియాన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రాఖీ, జాతీయ ఉపాధి హామీ పథకం జాయింట్ కమిషనర్ శివప్రసాద్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జల్ శక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గత మూడు రోజులుగా జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అమలులో భాగంగా ఫారం పాండ్లు, ఇంకుడు గుంతలు, చెరువులు, పలు నీటి సంరక్షణ పనులను పరిశీలించినట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలన్నారు. వర్షపు నీరు ఎక్కడ ఎప్పుడు ఎలా పడే నీటిని అక్కడే భూమిలోకి ఇంకింప జేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఋతుపవనాల వర్షపు నీటిని వడిసిపట్టి సంరక్షిస్తాం అన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ రామాంజనేయులు, జిల్లా వ్యవసాయ అధికారి సనఉల్లా, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి రాజశేఖర్ రెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ జెడి.పద్మమ్మ, ఏపీఎంఐపి పీడీ సుదర్శన్, జిల్లా హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్, వాట్ రీసోర్స్ శాఖ డిఈఈ గంగాద్రి, ఆర్‌డబ్ల్యూఎస్ ఆర్‌ఈవో రషీద్ ఖాన్, డీఎఒడొ రవీంద్రనాథ్ రెడ్డి, డీఎల్పీవో శివకుమారి పాల్గొన్నారు.

సామాన్యుడిపై.. కూరగాయాలు..!



మొన్నటి వరకు నిత్యావసర సరుకుల ధరలే అనుకుంటే ఇప్పుడు కాయగూరల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒక్క ఉల్లి, బంగాళదుంప మినహా అన్ని రకాల కూరగాయల ధరలు చుక్కల్లో ఉన్నాయి. అన్ని రకాల కాయగూరలు కిలో రూ.50 నుంచి రూ.100కుపైగా ధర ఉంటుండటంతో ఏమి కొనాలి, ఏమి తినాలా అని సామాన్యులు తలలుపట్టుకునే పరిస్థితి నెలకొంది.



- ◆ మండుతున్న కూరగాయల ధరలు
- ◆ సెంచరీ పలుకుతున్న టమోట ◆ అదే బాటలో మిర్చీ
- ◆ ఏమి తినాలంటూ సామాన్యుడి ఆవేదన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టమోట పంట జిల్లాలోనే అత్యధిక విస్తీర్ణంలో సాగవుతుంది. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు పెద్దఎత్తునే ఎగుమతి అవుతూ ఉండేవి. దీంతో స్థానికంగా కొంత ధర తక్కువగానే టమోటా ఉంటూ వచ్చింది. అయితే మార్చి, మే నెలల్లో వచ్చిన అకాల వర్షాలతో పెట్టిన టమోట పంట చేతికి రాలేదు. ఈ పంట మొత్తం దెబ్బతినడంతో స్థానికంగా టమోట పంట దిగుబడి లేకుండాపోయింది. సాధారణం జూన్ నుంచి అనంతపురం నగరంలోని అతిపెద్ద టమోట మార్కెట్‌కు పెద్దఎత్తున పంట రావాల్సింది. కాని ఇప్పటికీ రాలేదు. ఎక్కడా టమోట దొరక్కపోవడంతో మార్కెట్‌లో దీనికి డిమాండ్ పెరిగింది. దీంతో మొన్నటి వరకు కిలో రూ.15 వరకు టమోట ధర ఉండేది. ఇప్పుడు అమాంతంగా పెరిగి వంద రూపాయలకు చేరవైంది. హోల్‌సేల్ మార్కెట్‌లోనే కిలో టమోట ధర రూ.80 ఉంటోంది. రిటైల్‌కు వచ్చే సరికి కిలో రూ.120 వరకు ఉంటోంది. ఇదే బాటలో పచ్చి మిరపకాయలు కూడా కిలో రూ.80 వరకు హోల్‌సేల్‌లో ఉంది. రిటైల్‌లో ఇది కూడా వంద రూపాయలకుపైగా కిలో ఉంది. ఇక బెండ, వంకాయ, క్యారెట్ వంటివి కూడా కిలో రూ.60 వరకు ధర ఉంది. ఇంత పెద్దఎత్తున ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో ఏమి కోనాలి... ఏమి తినాలో అంటూ సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. రూ.500 తీసుకెళ్లినా దోసెడు కూరగాయలు రాని పరిస్థితి ఉందంటున్నారు.

ఏమి కొని తినగలం

కాయగూరల ధరలు అన్ని కిలో వంద రూపాయలకు దగ్గరగా ఉన్నాయి. కనీసం పచ్చడి చేసుకుని తినాలి అన్నా టమోట, మిర్చి అవసరం అవుతాయి. అవికూడా వంద రూపాయల చేరవయ్యాయి. ఇక చికెన్ ధరలు కూడా ఈ కాలంలో రూ.300కు చేరవ అవుతోంది. ఇలాగుంటే సామాన్యులు ఏమి కొని తినగలం. ప్రభుతం ఈ ధరలను తగ్గించాలి.

ఆరీఫా సుల్తానా,
గృహణి, అనంతపురం నగరం.

ధరలను నియంత్రించాలి

ఇప్పటికే నిత్యావసర ధరలు పెరిగాయి. దీనికితోడు కాయగూరల ధర పెరిగితే సామాన్యుడు ఏమి కొని తినగలడు. పెరిగిన కూరగాయల ధరలతో సామన్య, మధ్య తరగతి ప్రజలు కనీసం చారు కూడా చేసుకుని తినలేని పరిస్థితుల్లో ఉన్నారు. ప్రభుత్వం ఈ ధరల నియంత్రణపై దృష్టి సారించాలి. రైతు బజారుల్లో అందుబాటు ధరల్లో వీటిని ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలి.

సావిత్రి,
ఐద్వా రాష్ట్ర నాయకులు.



సత్యసాయి విమానాశ్రయంలో భద్రతా చర్యలపై సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

విమానాశ్రయంలో భద్రత కల్పిద్దాం

ఎస్పీ మాధవరెడ్డి, కలెక్టర్ పి.అరుణ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సత్యసాయి విమానాశ్రయంలో భద్రతా ప్రమాణాలు పెరగాలంటే అధికార యంత్రాంగం, ఎయిర్ పోర్ట్ నిర్వాహకుల మధ్య సమన్వయం వల్లనే సాధ్యమని ఎస్పీ మాధవరెడ్డి, కలెక్టర్ అరుణ్ బాబు తెలియజేశారు. మంగళవారం నాడు పుట్టపర్తి విమానాశ్రయం నందు ఎయిర్ పోర్ట్ భద్రత కమిటీ ఛైర్మెన్ హోదాలో కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎయిర్పోర్ట్ అడ్మిన్ లక్ష్మీనారాయణ, ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సాయినాథ్ ఆర్డీవో భాగ్యరేఖ పాల్గొన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సత్యసాయి విమానాశ్రయంలో భద్రతా పరమైన సమస్యలు తలెత్తినప్పుడు ఏయే శాఖలు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అది కేవలం విమానాశ్రయ నిర్వాహకులు, ప్రభుత్వ శాఖల మధ్య సమాచార బదిలీ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ఎయిర్‌పోర్టులో భద్రతా ప్రమాణాలు పెంచుదామని పిలుపునిచ్చారు. తొందర్లోనే ఈ విమానాశ్రయాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా కమర్షియల్ ఏర్పాటుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని దీని ద్వారా చుట్టుపక్కల ప్రాంతం ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. అనంతరం, పుట్టపర్తి ఎయిర్ పోర్ట్ అధికారులు పుట్టపర్తి విమానాశ్రయంపై పవర్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని అధికారుల తిలకించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఎస్పీ డిపిఒ వాసుదేవ, డీఎస్పీ విజయ్ కుమార్, శంకర్ ప్రసాద్, ఏర్పోర్ట్ ఎస్ఐ సుబ్బారావు, రవీంద్రనాథ్ రెడ్డి, తహశీల్దార్ నవీన్ కుమార్, జిల్లా ఫైర్ ఆఫీసర్ విమానాశ్రయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



జగన్న సురక్షపై ప్రజలకు వివరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజలకు మేలు చేసేలా 'జగనన్న సురక్ష'

కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-సోమందేపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మేలు చేసేలా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం కింద సర్వీస్‌ల నమోదు మరింత పెంచాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. మంగళవారం నాడు సోమందేపల్లి మండలంలోని వెలుగమేకలపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాలంటీర్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయం పరిధిలో వాలంటీర్లు ఇంటింటికీ ఖచ్చితంగా తిరగాలన్నారు. రిక్వెస్ట్‌లు ఇక్కడ తక్కువగా ఉన్నాయని రిక్వెస్ట్‌లను మరిన్ని పెంచాలన్నారు. అర్హత ఉన్నా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోతే అలాంటి వారికి లబ్ధి చేకూర్చాలని, ఆగస్టులో ఇచ్చే ద్వైవార్షిక నగదు పంపిణీలో పథకాల లబ్ధి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం సాయంత్రం వేళ ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష సర్వేను పూర్తి చేయాలన్నారు. గ్రామంలో హౌస్ హోల్డ్ సర్వే 660 పూర్తి చేయగా, సర్వీస్‌ల నమోదు ఎక్కువగా జరగలేదని, మరిన్ని సర్వీసులను నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే 11 రకాల సేవలను ఇంటింటా తెలియ జేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో భూమి కబ్జా

న్యాయం చేయాలని కోరిన బాధితులు

ప్రజాశక్తి-హిందూపురం

తమ భూమికి నకిలీ పత్రాలను సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకుని కబ్జా చేశారని బాధితులు వాపోయారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పట్టణానికి చెందిన భూపాళం లక్ష్మీనారాయణ, అతని కుమారులు శ్రీకాంత్, రాజేష్ నల్లయ్య, శశిధర్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మోతుకుపల్లి నుంచి మేళాపురం వెళ్లే దారిలో 66-1ఏ1లో తమకు చెందిన 18.40 ఎకరాల్లో 7.50 ఎకరాలు విక్రయించామని, మిగిలిన భూమి తమ అధీనంలో ఉందని అన్నారు. అయితే ఇబ్రహీం సాద్ వారసులుగా చెప్పుకునే వారు నకిలీ పత్రాలను సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. త్యాగరాజు అనే వ్యక్తి తప్పుడు పత్రాలను సృష్టించి ఎలాంటి పాసుపుస్తకం, వన్ బి లేకుండానే రిజిస్టర్ చేసుకున్నారన్నారు. సబ్ రిజిస్టర్లు సైతం పరిశీలించకుండా వారికి రిజిస్టర్ చేసి ఇచ్చారన్నారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లామని, అయితే త్యాగరాజుకు చెందిన వ్యక్తులు తమను చంపుతామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కృష్ణ ప్రకాష్, సుమంత్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

సమస్యలు పరిష్కరించకపోతే వార్డుల్లో ఎలా తిరగాలి..?

ప్రజాశక్తి-హిందూపురం

రెండున్నర ఏళ్లుగా వార్డుల్లో కనీస అభివృద్ధి జరగలేదని ఇలా అయితే వార్డుల్లో ఎలా తిరగాలని పలువురు కౌన్సిలర్లు నిలదీశారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన కౌన్సిల్ సాధరణ సమావేశం జరిగింది. ఈ సందర్భగంగా ఎప్పుడు లేని విధంగా కేవలం ఆరు అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ దృష్టికి తీసుకోచ్చారు. ఈ అంశాలపై చర్చించి సభ్యులు అజెండాను ఆమోదించారు. ఈసందర్భంగా పలువురు కౌన్సిలర్లు తమ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. 7వ వార్డు కౌన్సిలర్ నాసీర బాను తన వార్డులో ఏడాది క్రితం ప్రారంభించిన మురుగు కాలువ పనులు ఇప్పటికి పూర్తి కాలేదని, ఈ విషయాన్ని చాల సార్లు కౌన్సిల్ దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకోచ్చినా ఫలితం లేదన్నారు. కాలువ పనులు వెంటనే ప్రారంభించే వరకు ఇక్కడే దీక్ష చేస్తానని చెప్పారు. స్పందించిన చైర్‌పర్సన్ ఇంద్రజ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పనులు ప్రారంభించక పోతే గురువారం నుంచి మున్సిపల్ కార్యలయం ముందు దీక్ష చేస్తానని కౌన్సిలర్ నాసీర బాను హెచ్చరించారు. ఇలా పలువురు సభ్యులు తమ సమస్యలను సమావేశం దృష్టికి తీసువచ్చారు. ఈ సమావేశంలో కమిషనర్‌తో పాటు అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, అన్ని విభాగాల అధికారులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.



చైర్‌పర్సన్ పోడియం ముందు కూర్చొని నిరసన తెలుపుతున్న కౌన్సిలర్ నాసీర బాను

అర్జీదారులకు స్థలాలు చూపండి : వ్యకాసం



కమిషనర్ ఛాంబర్‌లో బైటాయించిన నాయకులు, బాధితులు

ప్రజాశక్తి -పెనుకొండ

ఇళ్లు లేని నిరుపేదలకు స్థలాలు చూపించాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. కమిషన్ చాంబర్‌లో బైటాయించి నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్ వంశీకృష్ణభార్గవ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ పేదలు అర్జీలు ఇచ్చి నెలరోజులు అవుతున్నా అధికారుల్లో చలనం లేదన్నారు. అర్జీలు పరిష్కారం చేయాలని కోరితే 90 రోజుల స్కీమ్ కింద ఇంకా రెండు నెలలు సమయం ఉందని అధికారులు తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. పట్టణంలో మున్సిపాలిటీ పరిధిలోని స్థలాలు, భూములను బడా నాయకులు ఆక్రమించుకుంటున్నా వాటిని నివారించే చర్యలు తీసుకోకపోవడం సిగ్గు చేటన్నారు. 15 రోజుల లోపు స్థలాలు చూపక పోతే పేదలతో కలిసి గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తిప్పన్న, నాయకులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ భూ పంపిణీ : జేసీ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్:

నిరుపేదలను గుర్తించి అసైన్మెంట్ కమిటీ ఆమోదం తర్వాత భూ పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో రీ సర్వే ప్రక్రియ, వివిధ ప్రాజెక్టులకు భూ సేకరణ తదితర అంశాలపై ఆర్‌డిఒ, తహశీల్దార్లు, డిఐఒలు, రీ సర్వే డిప్యూటీ తహశీలార్లు, మండల సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రీ సర్వే పనులు వేగంగా చేపట్టాలన్నారు. వివిధ మండలాల్లో పురోగతి తక్కువగా ఉందని అన్నారు. గ్రామాల్లో భూమిలేని నిరుపేదలను గుర్తించి వారికి భూ పంపిణీకి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. అసైన్మెంట్ కమిటీ ఆమోదం తర్వాత పట్టాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఓ కొండయ్య, ల్యాండ్ సర్వే రికార్డ్స్ ఎడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

ఓటరు జాబితా తయారీలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

ఆర్డీవో భాగ్యరేఖ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఓటరు జాబితా తయారీలో బూతు లెవల్ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని పుట్టపర్తి రెవిన్యూ డివిజనల్ అధికారి కెఎస్.భాగ్యరేఖ పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి ఎంపిడిఒ కార్యాలయంలో పుట్టపర్తి రూరల్, పుట్టపర్తి అర్బన్‌కు చెందిన బూత్ లెవల్ అధికారులు, సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తహశీల్దార్ నవీన్ కుమార్, ఎన్నికల డిప్యూటి తహశీల్దార్ నరసింహులు, డిఎఒ షేక్ జిలాని, డిప్యూటి తహశీల్దార్ షబ్బం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణకై ముదంస్తు కార్యక్రమాలు, సవరణ సమయం లోను, రెండు రకాల కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఇప్పటికే అవసరమైన శిక్షణా కార్యక్రమాన్ని కూడా నిర్వహించినట్లు తెలిపారు. జూలై 21 వ తేది నుంచి ఆగస్టు 21 వ తేది వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటా ఓటర్ల పరిశీలన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29 పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, ఈపీ రేషియో, జెండర్ రేషియో, డబుల్ ఓటర్లు, డేత్ ఓటర్లు, శాశ్వత బదిలీ ఓటర్లు, తొలగింపులు, ఎన్నికల కమీషన్ నిబంధనలు ప్రకారము చేయాలన్నారు. ఈ సమావేశంలో పుట్టపర్తి బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

ధర్మవరం టౌన్ : బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ శ్రీనివాసులు, వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం, టూటౌన్ సిఐ రాజా తెలిపారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో మంగళవారం ముస్లిం మత పెద్దలు, హిందువులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. హిందూ, ముస్లింలు స్నేహపూర్వకంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ముస్లింలు, హిందువులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ పేరుతో...

రూ.20 లక్షలు మోసం

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ప్రజాశక్తి-ఓబులదేవర చెరువు

అధిక వడ్డీ ఆశచూపి ఓ ప్రయివేటు ఉపాధ్యాయుడు డ్వాక్రా మహిళలను మోసం చేశాడు. రూ.20 లక్షలు తీసుకుని వారికి అసలు కూడా ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో బాధితులు మంగళవారం నాడు పోలీసులను ఆశ్రయించి వారి గోడును వెల్లబోసుకున్నారు. బాధితులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మండల పరిధిలోని కొండకమర్లకు చెందిన ప్రయివేటు ఉపాధ్యాయుడు గండికోటి చంద్ర అధిక డబ్బు చెల్లిస్తానని చంద్ర డ్వాక్రా మహిళలకు చెందిన రూ.20 లక్షలను 2011లో తీసుకున్నాడు. అప్పటి నుంచి ఒక్క రూపాయి కూడా వడ్డీ, అసలు ఇవ్వలేదు. పలుమార్లు మహిళలు డబ్బులు ఇవ్వాలని ఆయన్ను కోరినా స్పందన లేదు. ఇటీవల మహిళలు డబ్బు కోసం చంద్రను నిలదీస్తే తాను డబ్బులు ఇవ్వలేనని, ఐపి నోటీసులు పంపుతానని చెప్పాడు. కూలి పనులు చేసుకుని జీవనం సాగించే తమ డబ్బులను తీసుకుని మోసం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మహిళలు కోరారు. బాధితుల ఫిర్యాదు మేరకు దీనిపై విచారణ జరుపుతామని ఎస్ఐ గోపి తెలిపారు.



ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

బదిలీ ఉపాధ్యాయుడికి సన్మానం

మడకశిర రూరల్ : మండల పరిధిలోని కోతులగుట్ట గ్రామ పాఠశాలలో పనిచేస్తున్న శివన్న బదిలీపై వెళ్లడంతో ఆయనను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా హెచ్ఎం నాగరాజ్ఆచారి మాట్లాడుతూ శివన్న విద్యార్థుల విద్యాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయుడు శివన్నను ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. అదే విధంగా బదిలీపై ఇక్కడికి వచ్చిన పీటర్‌బాబును కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఎస్ చైర్మన్ నాగేంద్రప్ప, కమిటీ సభ్యులు, మిడ్ డే మిల్స్ ఏజెన్సీ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు... తొలగించారు...

రొద్దం : మండలకేంద్రంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయం ముందు నెలకొన్న అపరిశుభ్రతను తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. పడకేసిన పారిశుధ్యం శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు, పాలకులు స్పందించారు. రొద్దం సర్పంచ్ రూప, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్ స్పందించి కార్యాలయాల ముందు ఉన్న ప్లాస్టిక్ వ్యర్థలను తొలగించడానికి చర్యలు తీసుకున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

దోబీఘాట్ నిర్మాణానికి చేయూత

గాండ్లపెంట. మండల కేంద్రం సమీపంలోని రజకుల దోబీఘాట్ ఏర్పాటుకు రియల్ ఎస్టేట్ వ్యాపారి పాల్యం సుధాకర్ చేయూతను అందించారని స్థానిక వైసిపి నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం 80 వేల వేల రూపాయలను అందజేసినట్లు వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు శంకర నాయుడు, రజకులు పి బాబు. పి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో. వైసిపి మండల బీసీ నాయకులు లక్ష్మీ నరసింహ గౌడ్, వినుష్, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని గౌనిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి ఎంపీటీసీ కేశప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ కేశప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

1 నుంచి గ్రామసభలు

కొత్తచెరువు : మండలంలోని అన్ని గ్రామ సచివాలయ పరిధిలో జూలై 1 నుండి 31వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సిద్ధారెడ్డి తెలిపారు. మండల అధికారులు రెండు టీములుగా ఏర్పడి ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సచివాలయ ఉద్యోగులు వాలంటీర్లు గ్రామాల్లో ప్రతి ఇంటా తిరిగి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకుంటారన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

బత్తలపల్లి : స్థానిక అంకాలమ్మ ఆలయ గోపురానికి బత్తలపల్లి ఉప సర్పంచికోటి గోపీనాథ్ రూ.50వేలు విరాళం అందజేశారు. బత్తలపల్లి ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన అంకాలమ్మ దేవాలయాన్ని ఈ నెల 6వ తేదీన ప్రారంభించారు. ఆలయంపై గోపురం నిర్మించేందుకు వైసిపి నాయకుడు, ఉప సర్పంచు కోటి గోపీనాథ్ రూ.50వేల విరాళాన్ని ఆలయ అర్చకులు నరసింహులుకు అందజేశారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించండి

బత్తలపల్లి : పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఇఒ చాముండేశ్వరీ ఏజెన్సీ నిర్వహకులకు సూచించారు. మంగళవారం మండలంలోని వేల్పుమడుగు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను, నాడు-నేడు పనులను పరిశీలించారు. విద్యార్థులకు భోజనం వడ్డిస్తుండగా వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆక్కిం దామోదర్, హెచ్ఎం విజయవాణి, ఉపాధ్యాయులు రామాచారి, విద్యార్థి విభాగం నాయకులు నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలివ్వండి

తనకల్లు : మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు దాదాపు 9 నెలల నుండి వేతనాలు ఇవ్వకపోవటం అన్యాయమన్నారు. నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో పూల నరసింహులుకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శివన్న, సిఐటియు నాయకులు వేమన్న, నరసింహారెడ్డి, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనరాగులు పంపిణీ

పరిగి : మండలంలోని హొన్నంపల్లి రైతు భరోసా కేంద్రంలో అర్హులైన రైతులకు విత్తనరాగులను పంపిణీ చేశారు. స్థానిక సర్పంచి మంజునాథ్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి విజయభారతి ఆధ్వర్యంలో రైతులకు విత్తనరాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సహాయకులు హరీష్, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

30న చలో విజయవాడ

కనగానపల్లి : రైతాంగ సమస్యల పరిష్కారానికై ఈనెల 30 న విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని శ్రీ ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బత్తల కదిరప్ప కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులతో కలిసి ధర్నా పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా బత్తల కదిరప్ప మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈకార్యక్రమంలో రైతులు రామాంజనేయులు ముత్యాలు, నాగన్న, అంజి, నరసింహులు, ఆనంద, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో పండ్ల మొక్కలు పంపిణీ

పుట్టపర్తి రూరల్ : నాణ్యమైన ఎర్రచందనం, టేకు, వివిధ రకాల పండ్ల మొక్కలను సబ్సిడీ ధరలతో అందజేయనున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా అటవీ శాఖ అధికారి శ్యామల పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో జిల్లాలో 14 లక్షల మొక్కలను పెంచి ప్రజలకు, రైతులకు అందజేయనున్నామని చెప్పారు. అందుకోసం జిల్లా పరిధిలో 14 నర్సరీలలో సుమారు 50 జాతుల, మూడు లక్షల మొక్కలను నర్సరీలలో పెంచామన్నారు. నేరేడు ,జామ ,ఉసిరి, వేలగ, రావి ,సీతాఫలం మొక్కలు అందుబాటులో ఉన్నాయని వీటిని సబ్సిడీ ధరతో రైతులకు అందజేయనున్నామని వివరించారు. కావలసినవారు పెనుగొండ, కదిరి ఫారెస్ట్ అధికారులతో సంప్రదించాలని కోరారు. ప్రజలు రైతులు తమ పొలాల వద్ద నివాసాల వద్ద ఈ మొక్కలను పెంచుకోవడానికి అధికారులను సంప్రదించాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆలయ హుండీ లెక్కింపు

నల్లచెరువు : మండల పరిధిలోని పాలపాటి దిన్నే ఆంజనేయ స్వామి దేవస్థానం ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఈఏడాది ఫిబ్రవరి నుంచి ఈనెల 27వరకు వచ్చిన ఆదాయాన్ని లెక్కించగా 1,57,855 రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్ రెడ్డి, ఆలయ ఇన్స్‌పెక్టర్ నరసింహరాజు, పాలకమండలి సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రత్యేక చొరవ

రొళ్ల : విద్యాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలోని మండలపరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం హరిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులలో విద్యాప్రమాణాలను మెరుగు పరచడమే కాకుండా విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతీసుకుంటోందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా విద్యార్థుల విద్యాభివృద్ధిపై శ్రద్ధ వహించి సహకరిస్తే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పాలకమండలి అధ్యక్షుడు శివగంగు, పరమేష్, పాలకమండలి సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రమశిక్షణ అవసరం : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ఆధునిక సమాజంలో రోజురోజుకు పోటీ తత్వం పెరిగిపోతుందని, ఇందులో రాణించాలంటే యువతకి విద్య తో పాటు, అంకితభావం క్రమ శిక్షణ,బాధ్యతతో కూడిన అనుభవం ఉంటేనే ఏ రంగంలోనైనా విజయం సాధించగలుతారని జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి మండల పరిధిలోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల అవరణలో నెహ్రూ యువ కేంద్ర, యువజన వ్యవహారాల మరియు క్రీడా శాఖ భారత ప్రభుత్వం వారు నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవం-2023 కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారతదేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని, ప్రతి ఒక్కరూ వారిలో అంతర్లీనంగా దాగివున్న ప్రతిభను వెలికితీయాలని కోరారు. యువత విద్యతో పాటు ఇతర, సామాజిక కార్యక్రమాలపై అవగహన పెంచుకోవాలని సూచించారు. యుజనోత్సవం-2023 పంచప్రన్ కార్యక్రమంలో భాగంగా కవితలు,పెయింటింగ్, మొబైల్ ఫోటోగ్రఫీ, వక్తృత్వ, జానపద సాంస్కృతిక విభాగాల్లో జిల్లా స్థాయిలో విజయం సాధించిన వారికి ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ప్రెసిడెంట్ రాగే హరిత, సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల డీన్, నెహ్రూ యువజన కేంద్ర ప్రెసిడెంట్ శ్రీనివాసులు, ఇతర సిబ్బంది, వివిధ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులు చేపట్టండి

ప్రజాశక్తి - తనకల్లు


ఆందోళనలో పాల్గొన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

మండల పరిధిలోని గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతిని ప్రయాణం నరకప్రాయంగా మారిందని అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం కొక్కంటి క్రాస్ జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో పూల నరసింహులుకు అందజేశారు. ఈసందర్భంటా టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, తదితరులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడి దాదాపు నాలుగు సంవత్సరాలు పూర్తి అయినా గ్రామీణ రహదారులకు కనీసం తట్టేడు మట్టి వేసిన పాపాన పోలేదని విమర్శించారు. అదేవిధంగా బాలసముద్రం, గోవిందు వారి పల్లి, వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి నిర్మాణం వలన అక్కడ నీరు ఎక్కువగా నిలువ ఉండి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వాటికి శాశ్వత పరిష్కారం చూపి నిర్మాణాలు చేపట్టాలని లేకపోతే దశలవారీగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు సొంపాళ్యం నాగభూషణ, క్లస్టర్ ఇంచార్జి మల్లికార్జున, ఉత్తన్న నాయక్, వార్డు మెంబర్ దామోదర్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతోనే రాష్ట్రాభివృద్ధి


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల రూరల్: సంక్షేమ పథకాలతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే మాలగుంట్ల శంకరనారాయణ పేర్కొన్నారు. మంగళవారం గోరంట్ల మండలంలోని కమ్మవారి పల్లి గ్రామంలో నిర్వహించి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకుమునుపు ఎమ్మెల్యేకు గ్రామంలో సర్పంచి మణిశివ శంకరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వీరనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరంగారెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామస్తులు నాయకుల దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాతూరి శంకరరెడ్డి, సర్పంచి నాగేనాయక్‌తో పాటు పలువురు నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

తనకల్లు : ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్దారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గోవిందవారి పల్లి, సి బి కాలనీ, కొక్కంటి క్రాస్‌లో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, నాయకులు వైవి శ్రీనివాస్ నాయుడు, అరుణమ్మ, బిఎస్ నిజాం, పోలం సిద్ధారెడ్డి, కొండా మల్లికార్జున, హిమదర్ రెడ్డి, అశోక్ రెడ్డి, సర్పంచులు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. మండల పరిధిలోనిలో పెలుబండలో సర్పంచి చిత్తన్న యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీలు లలితమ్మ, కృష్ణమూర్తి, జెడ్పీటీసీ సారక్క నరసింహమూర్తి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ నళిని రంగేగౌడ్, డైరెక్టర్ వీరక్యాతప్ప తదితర నాయకులతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని డి చెర్లోపల్లి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం రూ 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రూ.17.50 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, రూ.21.90 లక్షలతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, రూ. 17.67 లక్షలతో నిర్మించిన జగనన్న పాలవెల్లువ మహిళా డైరీ సహకార సంఘం నూతన భవనాలను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎపి కురుబ కార్పోరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, ఎంపిపి త్రివేణి , తాడిమర్రి ఎంపిపి భువనేశ్వర్ రెడ్డి, అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాస్ రెడ్డి, సర్పంచి గుజ్జల రమాదేవితో పాటు పలువురు నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

హిందూపురం : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ ఇక్బాల్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మేన్ జబివుల్లా, కమిషనర్ ప్రమోద్ కుమార్‌తో కలిసి పట్టణంలోని 18వ వార్డు పరిధిలో బోయపేట ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ కవిత, కౌన్సిలర్లు అయూబ్, ముస్తక్, పరుశురాం, నాయకులు లతీఫ్ సేట్, శివన్న, లక్ష్మి నారాయణ, ఇలియాజ్, ఇలియాజ్ పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి పోరాటాలు


సమావేశంలో పాల్గొన్న నాయకులు, అంగన్వాడీలు

సోమందేపల్లి : అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం జూలై 10,11 తేదీల్లో కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని అంగన్వాడీ యూనియన్ నాయకులు కోరారు. మండల కేంద్రంలోని అంబా భవాని ఫంక్షన్ హాల్‌లో అంగన్వాడీల జిల్లా వర్క్ షాప్ ఉషారాణి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సుబ్బారావు మాట్లాడుతూ ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, అంగన్ వాడీలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచి, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటి అమలు చెయ్యాలని, ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కారం చెయ్యాలని అన్నారు. కోర్కెల దినం సందర్భంగా దేశ వ్యాపితంగా పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారం కోసం జూలై 10 11న కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాలలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లు కుదించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించక పోతే పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉధతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, ప్రాజెక్టు కార్యదర్శులు చంద్రకళ, లక్ష్మీదేవి, లావణ్య, సుశీల, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : అంగన్ వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి దశల వారీ ఉద్యమాలకు సిద్ధం కావాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప పిలుపు నిచ్చారు. అంగన్ వాడి కార్యకర్తల సమస్యలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహప్ప మాట్లాడుతు అంగన్ వాడీ కార్యకర్తల సమస్యలపై జూలై 10, 11 వతేదీలలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

పరిగి : ఈనెల 29న జరిగే బక్రీద్, తొలి ఏకాదశి పండుగ సందర్భంగా హిందూ ముస్లింలు సోదర భావంతో పండుగలు నిర్వహించుకోవాలని అలా కాదని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరేంద్ర హెచ్చరించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ముస్లిం, హిందూ మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశాన్ని తహశీల్దార్ సౌజన్య లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

లేపాక్షి : స్థానిక పోలీస్ స్టేషన్‌లో గ్రామ పెద్దలతో శాంతి కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వేణుగోపాల్ మాట్లాడుతూ రాబోయే రోజులలో వచ్చే పండుగలు ను శాంతి యుతంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాబు, ఎస్ఐ మునీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు

ముదిగుబ్బ : స్థానిక పోలీస్ స్టేషన్లో మండల ముస్లిం మతపెద్దలతో మంగళవారం శాంతి సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా సిఐ, ఎస్ఐ మాట్లాడుతూ గురువారం నిర్వహించే బక్రీద్ ను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

రొద్దం : బక్రీదు, తొలిఏకాదశి పండుగలను ఎలాంటి గొడవలు జరగకుండా సక్రమంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ కోరారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఇరుమతాల వారితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగస్వామి, తహశీల్దార్ అనంతచారి, ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణ వ్యాప్తంగా గురువారం జరిగే బక్రీద్ పండుగను శాంతి యుతంగా జరుపుకోవాలని ముస్లిం సోదరులకు అధికారులు సూచించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ హసీనా సుల్తానా అధ్యక్షతన శాంతి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముస్లీం మత పెద్దలతో పాటు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, పశు వైద్యులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'జగనన్న సురక్ష'

కొత్తచెరువు : జగనన్న సురక్ష పథకం సర్వేను వేగవంతంగా నిర్వహించాలని ఎంపీపీ గాయత్రి రెడ్డప్ప రెడ్డి, మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు మండల పరిధిలోని తలమర్ల కోడపగానిపల్లె మీర్జాపురం ఈ గ్రామాల్లో ఈ పథకంపై వాలంటీర్లకు, గృహ సారథులకు, సచివాలయ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అలివేలమ్మ, రత్నమ్మ, చెన్నారెడ్డి, ఎంపీటీసీ రమణారెడ్డి, సాంబశివారెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : జగనన్న సురక్ష పథకం అమలు తీరును ఎంపిడిఒ అంజనప్ప పరిశీలించారు. కదిరి రూరల్ మండలం పట్నంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అర్హత ఉండి ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకుండా ఉంటే వారికి కావలసిన సర్టిఫికెట్లు అందించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచితో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రతి గడపను సందర్శించి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను పొందుటకు కావాల్సిన ఇతరత్రా డ్యాకుమెంట్లు సేకరించి రిజిస్ట్రేషన్ చేయాలని ధర్మవరం ఆర్టీవో తిప్పేనాయక్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో చేపట్టిన జగనన్న సురక్ష సర్వేను తహశీల్దార్ యుగేశ్వరిదేవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో 98 శాతం మందికి లబ్ధి జరిగిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మిగిలిన 2శాతం అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలన్న లక్ష్యంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రవికాంత్ రెడ్డి, భరద్వాజాబాయి, సాయి మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల పరిధిలోని మానేంపల్లి పంచాయతీ లో మంగళవారం జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా అధికారులు ఇంటిటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహ నాయుడు, తహశీల్దార్ బాబు, సెక్రటరీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి మున్సిపాలిటీలో జులై ఒకటవ తేదీ నుండి ప్రారంభమయ్యే గనన్న సురక్ష కార్యక్రమం పై ఎమ్మెల్యే పి వి సిద్దా రెడ్డి మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, సచివాలయ సిబ్బంది వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్నాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు : మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీలలో కర్నాటక మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. నిందితుడి నుంచి 30 ప్యాకెట్ల కర్నాటకమద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

విద్యార్థి అదృశ్యం

ఓబుల దేవర చెరువు : తమ కుమారుడు తప్పిపోయాడని ఆచూకీ తెలపాలని మండల పరిధిలోని అల్లాపల్లి గ్రామానికి చెందిన శింగారప్ప శంకర మునెప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడు అనిల్ విజ్ఞాన్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడన్నాడు. ఈనెల 26న ఉదయం బస్సు పాస్‌కు డబ్బులు కట్టి వస్తానని తన వద్ద వెయ్యిరూపాయలు తీసుకుని వెళ్లాడన్నారు. ఇంతవరకు తిరిగి రాలేదన్నారు. తెలిసిన వారిందిరిని అడిగినా ఆచూకీ తెలియలేదన్నారు. అనిల్ ఆచూకీ తెలిస్తే 9398618672 నెంబరుకు సమాచార మివ్వాలని కోరారు.

నాయీ బ్రహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి

హిందూపురం : నాయీబ్రహ్మణులు అన్నిరంగాల్లో రాణించాలని ఎంపీ గోరంట్లమాధవ్, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. హిందూపురంలోని 4వార్డు త్యాగరాజనగర్‌లో నాయీబ్రాహ్మణ సేవాసంఘం సంగీత పాఠశాల నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్సీతో పాటు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్ నాగేంద్రబాబు, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు లోకేష్, నాయీబ్రహ్మణ సంఘం నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయునిపై దాడి అమానుషం

పుట్టపర్తి అర్బన్ : విధి నిర్వహణలో ఉన్న పాత్రికేయులపై దాడి చేయడం అమానుషమని సిపిఎం పట్టణ శాఖ కార్యదర్శి బ్యాళ్ల అంజి, కొత్తచెరువు మండల కార్యదర్శి ముత్యాలు, ఎస్ ఎఫ్ ఐ నాయకుడు పవన్ అన్నారు. ఈ మేరకు వారు మంగళవారం పుట్టపర్తిలో మాట్లాడుతూ బుక్కపట్నం మండలం మారాలలో ఒక టీవీ ఛానల్ విలేకరి నరసింహులు పై ఫీల్డ్ అసిస్టెంట్ రామ్మోహన్ దాడి చేయడం దుర్మార్గం అన్నారు. నిందితులను కఠినంగా శిక్షిస్తే ఇలాంటి సంఘటనలు పునరావృతంకావన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

బుక్కపట్నం : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే నైపుణ్య అభివృద్ధి సంస్థ లక్ష్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో రెండు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మేళాలో 72 మంది యువతీ యువకులు పాల్గొనగా అందులో 24 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నైపుణ్య అభివృద్ధి సంస్థ ప్రతినిధి తేజ్ కుమార్ రెడ్డి, కంపెనీ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

హిందూపురం : సబ్ జైల్లోకి వచ్చే ఖైదీల సంక్షేమానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి సబ్‌జైల్ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక సబ్ జైలును ఆమె తనిఖీ చేశారు.. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడారు. ప్రవర్తన మార్చుకుని మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎజిపి శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, కృష్ణమూర్తి, నవీన్, గురునాథ్, నవేరా, లోక్ అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

హిందూపురం : అర్హులైన వారెవరూ మిగిలిపోకుండా అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ తన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి జగనన్న సురక్ష పథకంపై వివరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మేన్ జబివుల్లా, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మాజీ సమన్వయ కర్త కొండురు వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ నాగభూషణ, కౌన్సిలర్లు నాగేంద్ర బాబు, అయూబ్, మల్లికార్జున, ముస్తక్, నాయకులు చాంద్‌బాషా, పురుషోత్తం రెడ్డి, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జా దారులకు పోలీసుల అండ : కాంగ్రెస్

హిందూపురం : పట్టణంలో పోలీసులు భూ కబ్జా దారులకు అండగా నిలిచి న్యాయం కోసం వచ్చిన బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని యువజన కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కబ్జాదారులకు అండగా నిలబడి, స్వయంగా పోలీసులే స్థలాన్ని ఖాళీ చేయించడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ యువజన కాంగ్రెస్ నాయకులు వన్ టౌన్ స్టేషన్ ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులతో పాటు నాయకులు సంపత్ కుమార్ మాట్లాడుతు బాదితులు భూ కబ్జాపై ఫిర్యాదు ఇచ్చి మూడు రోజులు కావస్తున్న పోలీసులు పట్టించు కోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిత్రార్జితం కింద సంక్రమించిన ఆస్తిని కొంత మంది కబ్జా చేశారన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులను ఆశ్రయిస్తే వారికి న్యాయం చేయడం లేదన్నారు. ధర్నా విరమించి స్టేషన్‌లోకి వచ్చి మాట్లాడాలంటూ సిఐ బాధితులకు సూచించారు. తమకు న్యాయం జరగకపోతే స్టేషన్ ముందు ఆత్మహత్య చేసుకుంటామని బాధితులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితులతో పాటు యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రీకౌంటింగ్‌లో విద్యార్థినికి న్యాయం

కదిరి టౌన్ : కదిరి పట్టణం ఎన్జీవో కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు కొట్టే శ్రీనివాసులు కుమార్తె కీర్తనకు పదవ తరగతి మార్కుల కౌంటింగ్‌లో అన్యాయం జరగగా రీకౌంటింగ్ ద్వారా న్యాయం జరిగింది. ఎన్జీవో కాలనీలో నివాసం ఉంటున్న కొట్టే శ్రీనివాసులు కుమార్తె కొట్టే కీర్తన పట్టణంలోని నారాయణ విద్యాసంస్థలో పదవ తరగతి చదువుతోంది. 2023 మార్చి పరీక్షల్లో పరీక్షలు రాసింది. ఫలితాల్లో కీర్తనకు తెలుగులో వందకు వంద, ఇంగ్లీషులో వందకు 96, గణితంలో 95, సైన్స్‌లో 98, సోషియల్‌లో 97 మార్కులు వచ్చాయి. అయితే హిందీలో కేవలం 47 మార్కులే వచ్చాయి. దీంతో విద్యార్థిని కీర్తన తండ్రి శ్రీనివాసులు రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేశాడు. దీంతో బోర్డు వారు రీకౌంటింగ్ చేయగా విద్యార్థినికి హిందీలో 97మార్కులు వచ్చినట్లు గుర్తించారు. ఆ మేరకు కీర్తనకు 10వ తరగతి పరీక్షలలో 600 మార్కులకు గాను 585 మార్కులు వచ్చినట్లు నిర్ధారణ అయింది. వాస్తవానికి కదిరి పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినికి 586 మార్కులతో మొదటి స్థానంలో నిలువగా నారాయణ విద్యాసంస్థకు చెందిన కీర్తన రెండవ స్థానంలో నిలిచింది. దీంతో విద్యార్థిని కీర్తన తో పాటు తల్లిదండ్రులు శ్రీనివాసులు, ప్రసన్న హర్షం వ్యక్తం చేశారు.

మహిళలకు చీరలు పంపిణీ

హిందూపురం : ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ జన్మదిన వేడుకల సందర్భంగా 500 మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. మంగళవారం పట్టణంలోని టీచర్స్ కాలనీలోని తన కార్లాయయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్యలో నవీన్ నిశ్చల్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నవీన్ అభిమానులు, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.